# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 10, నవంబర్ 2025


## గుడుంబా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

**ఆసిఫాబాద్, నవంబర్ 9, ప్రభాతవార్త**

మండలంలోని ఇప్పల్ నవేగాం బస్ స్టాప్ వద్ద అక్రమంగా గుడంబా రవాణా చేస్తున్న వ్యక్తిని ఆదివారం ఉదయం టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం ఇప్పల్ నవేగాం గ్రామానికి చెందిన చిలుకయ్య అక్రమంగా గుడుంబాను తరలిస్తున్న సమయంలో టాస్క్ఫోర్స్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుకొన్నారు. ఈ దాడిలో మొత్తం 10 లీటర్ల గుడుంబా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్ లో అప్పగించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్యానికి హానికరమైన అక్రమ గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై కందూరి, హెడ్ కానిస్టేబుల్ మహ్మద్, కానిస్టేబుల్ సంజీవ్, దేవేందర్లు పాల్గొన్నారు.



# నాడు పచ్చని స్వప్నం... నేడు ఎండిపోతున్న జ్ఞాపకం..!



- ✶ కొమురం భీం జిల్లాలో నీరు లేక నిర్లక్ష్యంగా పల్లె ప్రకృతి వనాలు
- ✶ నిధులు లేక నిర్వహణ కరువు
- ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి సంరక్షించాలి



**పెంచికల్‌పేట్, నవంబర్ 09, ప్రభాతవార్త :**

గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో స్థాపించబడిన పల్లె ప్రకృతి వనాలు ఒకప్పుడు గ్రామాలకు పసిడిపచ్చని ఉపిరిలా నిలిచాయి. కానీ ప్రస్తుతం ఇప్పుడు చాల గ్రామాల్లో నీటి కొరత, నిధులలేమి, నిర్వహణ లోపం కారణంగా ప్రకృతి వనాల పరిస్థితి నాటి పచ్చని స్వప్నం నేడు ఎండిపోతున్న జ్ఞాపకంగా మారుతుంది.పల్లె ప్రకృతి వనాలు పర్యావరణ సమత్యుల్యతను కాపాడుతూ పల్లె ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్ స్థాయిల పెంపు, ప్రజలకు ప్రకృతి అందాల మధ్య విశ్రాంతి వాతావరణం కల్పించడం, వర్షాభావ పరిస్థితుల్లో సహజ నీటి నిల్వలను రక్షించడం, ప్రజల్లో పర్యావరణం చైతన్యం పెంపుదల వంటి లక్ష్యాలతో పచ్చ తెలంగాణ మిషన్ నిధులు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్ ) నిధులు, గ్రామా పంచాయతీ నిధుల ద్వారా పుష్పవనాలు, నీటి వనరుల ఏర్పాటు, కూర్చునే బెంచీలు, సౌర దీపాలు, కాపౌండ్ గోడలు వంటి మౌలిక సదుపాయాలకు భారీగా ఖర్చు పెట్టి పర్యావరణ రక్షణకు చిహ్నాలుగా పల్లె ప్రకృతి వనాలను నిర్మించారు.

2లో..

## పడకేసిన పారిశుధ్యం..
# ఎక్కడి చెత్త అక్కడే..!

**తాండూర్, నవంబర్ 9, ప్రభాతవార్త :**

మండలంలోని కార్మిక క్షేత్రమైన మాదారం టౌన్ షిప్ లోని పలు ప్రాంతాలు, రోడ్లు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుద్ధం పడకేసింది. గతంలో మాదారంలో 17 మంది సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేయడం వలన రోడ్లు, కార్మిక వాడలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవి. గత కొన్ని రోజుల నుంచి ఆరుగురు సింగరేణి కాంట్రాక్టు కార్మికులతో సంబంధిత సింగరేణి అధికారులు కొన్ని ప్రాంతాలలోనే పారిశుద్ధ్య పనులను చేయిస్తున్నారు. సింగరేణి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్మికేతర కుటుంబాలు నివాసం ఉంటున్న ప్రాంతాలలో స్థానిక సింగరేణి సివిల్ అధికారులు పారిశుద్ధ్య పనులను చేయించడం లేదు. సింగరేణి అధికారులు, గ్రామ పంచాయతీ అధికారుల మధ్య పారుశుద్ధ్య పనులపై సమన్వయం లోపించి కొన్ని ప్రాంతాలలో మిగతా 2లో..





## సింగరేణి అధికారుల సమస్యల పై
# సానుకూలంగా స్పందించిన సీ అండ్ ఎం.డీ

★ సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డీ పంతులా



**జైపూర్, నవంబర్ 09, ప్రభాతవార్త**

సింగరేణి పవర్ ప్లాంటును సందర్శించిన సంస్థ సీఎండీ ఎన్.బలరాం నాయక్‌కు అధికారులు సంఘం సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతులా పూల మొక్కను అందజేశారు. అధికారులకు చెల్లించాల్సిన పీఆర్సి బకాయిల గురించి సీఎండీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతులా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరాం, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఆకస్మికంగా సందర్శించారని అన్నారు. ఎన్ బలరాం, సింగరేణి సంస్థ సీఎండీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఉద్యోగులకు, కాంట్రాక్టు వర్కర్‌లకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. వాటిలో ఉద్యోగులకు ఒక కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగులకు వారి డిపెండెంట్‌లకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే లక్ష్యంతో హైదరాబాదులో సింగరేణి సూపర్ మిగతా 2లో..

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

నుంచి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ ఇతర శాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కొరకు 40 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలు ఎత్తైన ప్రదేశాలలో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు, ప్యాడి క్లీనర్లు, ట్యాబులు, టార్పాలిన్ కవర్లు సమకూర్చడం జరిగిందని, రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. పత్తి కొనుగలు ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారి అశ్వక్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, రవాణా శాఖ అధికారి రామ్ చందర్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అనంతలక్ష్మి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

సారంగపల్లి గ్రామానికి చెందిన బచ్చలి ప్రవీణ్ కుమార్ మండలంలోని తుర్కపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన ఇల్లందుల రాజమణి తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ తన దరఖాస్తులో అడ్డా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. చెన్నూర్ మండలం ఆస్నాద్ గ్రామానికి చెందిన రామిళ్ళ ప్రమీల తనకు 2013లో ప్రభుత్వం భూమిని పట్టా ఇచ్చిందని, ఇట్టి పట్టాను డిజిటలైజ్ చేసి నూతన పట్టా పాస్ పుస్తకం మంజూరు చేసి తనకు భూమిని చూపించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్సెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గవ్వల శంకరయ్య మండలంలోని రెబ్బెనపల్లి గ్రామ శివారులో తన తల్లి నుండి వారసత్వంగా వస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని అశోక్ రోడ్ ప్రాంతానికి చెందిన బెజ్జంకి రమ తన భర్త కంచరీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే వారిని, తనకు పక్షవాతం రావడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, భర్తకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన ఆసరి రాజలక్ష్మి శ్రీ నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కాసర్ల శ్రీనివాస్, మంచు శంకర్‌లు తమ దరఖాస్తులో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని, ప్రతి నెల సదరం శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా...

# ముగ్గురు అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ రాజు కంధూరి, హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్, కానిస్టేబుళ్లు విజయ్, రమేష్ మరియు హోంగార్డు శేఖర్‌లు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బ మహేష్, ఉపాధ్యాయులు

## క్రీడా కుసుమాలకు అభినందనల వెల్లువ

**ఆసిఫాబాద్, నవంబర్ 10, ప్రభాతవార్త :**

రాష్ట్ర స్థాయి అండర్17 బాలబాలికల హ్యాండ్ బాల్ పోటిల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన దాసరి శ్రేష్ఠను సోమవారం పాఠశాల సిబ్బంది కొనియాడారు. జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి హై స్కూల్ లో చదువుతున్న విద్యార్థిని ఈ నెల 7 నుండి 9 వ తేదీ వరకు నారాయణ పేట జిల్లా కోస్గి మండలంలో నిర్వహించిన 69 వ ఎస్జిఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్17 బాలబాలికల హ్యాండ్ బాల్ పోటిల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టులో పాల్గొని మొదటి స్థానంలో గెలిచి బంగారు పథకం సాధించారు. ఈ జట్టులో తమ పాఠశాల విద్యార్థిని దాసరి శ్రేష్ఠ పాల్గొని, ప్రతిభ కనబర్చడం సంతోషదాయకమని ప్రిన్సిపాల్ మహేష్ అన్నారు. క్రీడాకారులు సాధించిన మెడల్స్, సర్టిఫికెట్ల తో సత్కరించారు. అనంతరం క్రీడాకారులను, పిఈటి గోగర్ల సాయిని పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ప్రసాద్,మేనేజ్మెంట్ సభ్యులు రాజ్ కుమార్, దాసరి సురేష్ కుమార్, అజయ్, క్రాంతి కుమార్, అధ్యాపక బృందం విద్యార్థులు అభినందించారు.

## రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

కంట్రోల్ రూమ్ నం.6303928682 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 1967, 1800 4250 0333 నెంబర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు అవసరమైన కొనుగోలు కేంద్రాల సమాచారం అందించడంతో పాటు, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జన్నారం మండల ఇన్చార్జి ఏఓగా అంజిత్ కుమార్

**జన్నారం, నవంబర్ 10, ప్రభాతవార్త**



జన్నారం మండల ఇంచార్జ్ వ్యవసాయ శాఖ అధికారిగా గొర్ల అంజిత్ కుమార్ సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. దండేపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న ఆయనను జన్నారం ఏవోగా నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన మండల వ్యవసాయ శాఖ అధికారిణి సంగీత ఇన్ సర్వీస్ కింద పీజీ చదువుకోవడానికి రెండేళ్ల పాటు సెలవుపై వెళ్ళినందున ఆమె స్థానంలో దండేపల్లి ఏవోకు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కల్తీ, నకిలీ విత్తనాల పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఓకు మండల ఏఈవోలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో అక్షితకు ప్రథమ స్థానం

**వేమనపల్లి, నవంబర్ 10, ప్రభాతవార్త**

టీ సాట్ నెట్వర్క్, టీఎస్ జిహెచ్ఎంఎ సంయుక్త ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన క్విజ్ పోటీలో నీల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి మానెపల్లి అక్షిత ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్ రెడ్డి తెలిపారు. అక్షిత జిల్లా స్థాయి పోటీలలో మొదటి స్థానం సంపాదించి, జోనల్ స్థాయికి ఎంపిక కావడం గర్వ కారణమని పాఠశాల యజమాన్యం పేర్కొంది. విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.






వినతిపత్రం అందజేస్తున్న ముంజం ఆనంద్‌కుమార్

## పెండింగ్‌లో ఉన్న ధృవీకరణ పత్రములు జారీచేసేలా చర్యలు తీసుకోవాలి

**కాగజ్‌నగర్ రూరల్ ,నవంబర్ 10, ప్రభాతవార్త :**

పెండింగ్‌లో ఉన్న ధృవీకరణ పత్రములు జారీ చేయించాలని కోరుతూ సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీపీఎం కార్యకర్త ముంజం ఆనంద్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ మండల కార్యలయంలో కుల, ఆదాయ,నివాస,కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రములు 2020 నుండి చాల ధృవీకరణ పత్రములు పెండింగులో ఉన్నందున ప్రజలకు ఏమి చేయాలో తోచక నిస్సహాయ స్థితిలో ఉన్నారని అన్నారని కాని కార్యాలయ అధికారులు ఎవరు డబ్బులు ఇస్తే వారివే చేయడం, మిగత వారి ధృవీకరణ పత్రములు చేయకపోవడం వలన వందల ధృవీకరణ పత్రములు పెండింగులో ఉన్నాయని ఆరోపించారు. ఉన్నతాధికారులు మీసేవ ద్వారా వచ్చిన ధృవీకరణ పత్రములను గురించి సమీక్ష నిర్వహించక పోవడం వలన తహసిల్దార్ నిమ్మకు నీరు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి పెండింగ్‌లో ఉన్న ధృవీకరణ పత్రములు అన్ని జారీచేసేలా తగు చర్యలు తీసుకుంటారని కోరారు. ఈ కార్యక్రమంలో వసాకే సాయి, కూచిపూడి ఏసు కుమార్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

## మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్**



కంటిపరీక్షలకు వెళ్తున్న వారికి భోజనం అందజేస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్

**కాగజ్‌నగర్,నవంబర్ 10, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కొత్తపల్లి వెంకటలక్ష్మి శ్రీ-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. సొసైటి వారి ఆధర్వంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షలో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణా,భోజనం సదుపాయం కల్పించి 13 మందికి ఆపరేషన్ కోసం సోమవారం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్ చేయించామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపరేషన్ చేయించికొని లబ్ధి పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపి కిమ్స్ ,హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, నవంబర్ 10, ప్రభాతవార్త

అటవీ భూముల అక్రమ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి పోలీస్, రెవెన్యూ, అటవీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ భూముల అక్రమ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరైన అనుమతులు లేకుండా అటవీ భూములను ఆక్రమించిన, వృక్షాలను నరికిన క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అటవీ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలని, నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





ఆహ్వాన పత్రం అందజేస్తున్న గౌడ్ సంఘం సభ్యులు

## ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపనకు ఆహ్వానం

సారంగాపూర్, నవంబర్ 10, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన త్రయాహ్నిక మహోత్సవంకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మండల గౌడ్ సంఘ సభ్యులు సోమవారం మండలంలోని ప్రముఖ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. తాసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, వ్యవసాయ అధికారి వికర్ అహ్మద్, డిప్యూటీ తాసిల్దార్ రవీందర్, ఎస్‌బిఐ బ్యాంక్ సిబ్బందిని కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నేడు నిర్వహించబడనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవానికి తప్పక హాజరు కావాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మకు అక్షర రూపం ఇచ్చిన మహాకవి అందెశ్రీ

### - ఆత్రం సుగుణక్క సంతాపం

ఉట్నూర్, నవంబర్ 10, ప్రభాతవార్త:

తెలంగాణ కవి, ఉద్యమకారుడు, సాహితీవేత్త అందెశ్రీ మరణం తెలంగాణ రాష్ట్రానికి అపార నష్టమని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క అన్నారు. సోమవారం ఆయన ఆకస్మిక మరణ వార్త తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. తెలంగాణ సాహిత్య లోకం ఒక ప్రగాఢమైన సాహితీవేత్తను, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే కవిని కోల్పోయిందని ఆమె పేర్కొన్నారు. జయ జయహే తెలంగాణ" పాట ద్వారా తెలంగాణ ఉద్యమానికి నూతన శక్తి, భావోద్వేగం అందించిన అందెశ్రీ కృషి మరువలేనిదన్నారు. రాష్ట్ర అవతరణలో ఆయన పాత్ర చారిత్రాత్మకమైందని గుర్తు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, కుటుంబ సభ్యులకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

తాండూర్, నవంబర్ 10, ప్రభాతవార్త :

మండలంలోని అచ్చలాపూర్ జెడ్పిహెచ్ఎస్ లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని అమూల్య రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు అర్గం సాంబమూర్తి తెలిపారు. ఈనెల 9న ఉమ్మడి ఆదిలాబాద్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా సోమగూడెం సింగరేణి గ్రౌండ్స్ లో సీనియర్ మహిళల వాలీబాల్ ఎంపిక పోటీలలో అమూల్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 13 నుండి 16 వ తేదీ వరకు మేడ్చల్ లోని వేముల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ కళాశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందన్నారు. విద్యార్థిని అమూల్యను పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, ఎంపిపి చైర్మన్ చిలుకమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



విద్యార్థిని అమూల్యను అభినందిస్తున్న హెచ్ఎం,ఉపాధ్యాయులు

## అందెశ్రీకి ఘన నివాళులు

సారంగాపూర్, నవంబర్ 10, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో తెలంగాణ రాష్ట్ర గీతం, జయ జయ తెలంగాణ రచించిన ప్రముఖ కవి, గాయకులు అకస్మికంగా మరణించడంతో విద్యార్థి లోకం తీవ్ర దిగ్భ్రాంతికిలోనైంది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆశువులు బసిన కవి రాసిన మాయమైపోతున్నావమ్మా మనిషన్నవాడు జయజయ తెలంగాణ గీతాన్ని ఆలపించి సామూహికంగా ఆలపించి కన్నీటితో అశ్రునివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే చొరవతో బోరుబావి ఏర్పాటు

సారంగాపూర్, నవంబర్ 10, ప్రభాతవార్త:

మండలంలోని కుప్టి గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చొరవతో కొత్త బోరుబావి ఏర్పాటు చేయబడింది. గ్రామ ప్రజలు తాగునీటి సౌకర్యం కోసం బోరుబావి అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి బోరుబావి తవ్వించేలా చర్యలు తీసుకున్నారు. నూతన మోటార్ అమర్చి గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. తమ వినతి మేరకు స్పందించి బోరుబావి ఏర్పాటు చేసినందుకు గ్రామస్థులు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్, వినోద్, కేశవులు నాయక్, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## - ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్

ఉట్నూర్, నవంబర్ 10, ప్రభాతవార్త



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉట్నూరు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమవారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నేరడిగొండ మండలం నేరడిగొండ గ్రామానికి చెందిన పరశురామ్ తనకు బోర్‌వెల్ మంజూరు కోరుతూ అర్జీ సమర్పించారు. ఇంద్రవెల్లి మండలం మార్కగూడ గ్రామానికి చెందిన కొడప భీంరావ్ తనకు కిరాణా దుకాణం లోన్ ఇపించమని కోరుతూ అర్జీ సమర్పించారు. గుడిహత్నూర్ మండలం తోషం గ్రామానికి చెందిన కోహచ్చాడా నారాయణ తనకు గేదల లోన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో అదనపు వైద్యశాఖ అధికారి ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం సందర్శించి ఔషధాలను పరికరాలను పరిశీలించి పరీక్షలు చేయించుకున్నారు. ప్రజావాణికి వచ్చే ప్రజలందరికీ పరీక్షలు చేయించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో విద్యార్థినుల అద్భుత ప్రతిభ

సారంగాపూర్, ప్రభాతవార్త:



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, లెఫ్ట్ పోచంపాడులో నవంబర్ 6 నుండి 8 వరకు జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జామ్ విద్యార్థినులు తమ ప్రతిభను చాటారు. వివిధ క్రీడా విభాగాల్లో అగ్రస్థానాలు సాధించి పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారు. 8వ తరగతి సెక్షన్ బి చెందిన జగశ్రీ అండర్14 విభాగంలో లాంగ్ జంప్‌లో మొదటి బహుమతి, డిస్కస్ త్రోలో మూడవ బహుమతి, షాట్‌పుట్‌లో రెండవ బహుమతి గెలుచుకుంది. అదే తరగతిలోని హిందూ డిస్కస్ త్రోలో మొదటి బహుమతి, హై జంప్‌లో రెండవ బహుమతి, 400 మీటర్ల పరుగులో రెండవ బహుమతి సాధించింది. అండర్14 విభాగంలో 100 మీటర్ల పరుగులో సాక్షి రెండవ బహుమతి గెలుచుకుంది. జామ్ విద్యార్థినుల అండర్14 కబడ్డీ జట్టు కూడా రెండవ స్థానం దక్కించుకుంది. అండర్17 విభాగంలో క్యారమ్స్‌లో మంజుల, అలేఖ్య జంటగా రెండవ బహుమతి, చెస్‌లో 10వ తరగతి విద్యార్థిని సనా రెండవ బహుమతి సాధించింది. అండర్19 విభాగంలో 800 మీటర్ల పరుగులో సాహిత్య రెండవ బహుమతి గెలుచుకుంది. ఇక అండర్14 అథ్లెటిక్స్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విభాగాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించి జామ్ విద్యార్థినులు ప్రత్యేక గుర్తింపు పొందారు. క్రీడా పోటీలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో కూడా వారు మొదటి బహుమతి గెలుచుకున్నారు. విద్యార్థినుల ఈ విజయంపై పాఠశాల ప్రిన్సిపల్ బి.సంగీత, పిఈటీ సుస్మిత, పీడీ సుప్రియ, మ్యూజిక్ టీచర్ స్వప్న, సిబ్బంది, తల్లిదండ్రులు విద్యార్థినులను అభినందించారు.

# డ్రైవర్ నిరక్ష్యంతో నిండు ప్రాణం బలి

**- పత్తి చేనులో నిద్రలో ఉండగా కాంక్రీట్ మిక్సింగ్ వాహనం తొక్కి కార్మికుడు మృతి**

**మందమర్రి, నవంబర్ 10, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణ పరిధిలో చోటుచేసుకున్న విషాద ఘటనలో డ్రైవర్ నిర్లక్ష్యంతో ఒక కార్మికుడు నిండు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు బీహార్ రాష్ట్రం పాట్నా జిల్లా వాసి కాను ప్రసాద్ (43) అని పోలీసులు తెలిపారు. ఆయన తండ్రి పేరు అమరిక్ ప్రసాద్. సమాచారం మేరకు, మృతుడు కాను ప్రసాద్ దాదాపు రెండు నెలల క్రితం బీహార్ నుంచి కొంతమంది సహచరులతో కలిసి మందమర్రి సబ్ స్టేషన్ వెనుక ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్మిషన్ లైన్ కాంక్రీట్ పనుల కోసం వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం వరకు కాంక్రీట్ పనులు చేసిన అనంతరం సహచరులతో కలిసి భోజనం చేసి సమీపంలోని పత్తి చేనులో విశ్రాంతి కోసం పడుకున్నాడు. ఈ సమయంలో కాంక్రీట్ మిక్సింగ్ వాహనం అక్కడికి చేరుకోవడంతో, డ్రైవర్ నిర్లక్ష్యవశాత్తు నిద్రలో ఉన్న కాను ప్రసాద్ తలపై నుంచి వాహనం వెళ్లడంతో, ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వార్త తెలిసిన వెంటనే మందమర్రి సీఐ, ఎస్సైలు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనంతరం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించగా, వారు చేరుకున్న తర్వాత ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో సహచర కార్మికుల్లో తీవ్ర విషాదం నెలకొంది.



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

## ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 10, ప్రభాతవార్త :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి దరఖాస్తు స్వీకరించారు. కెరమెరి మండలం ధనోరా గ్రామానికి చెందిన తొడసం బాలు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. అదేవిధంగా కెరమెరి మండలం పిప్రి గ్రామానికి చెందిన నాయుడి ఎల్లక్క తాము సాగు చేసిన కంది, మొక్కజొన్న పంటలు భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్నాయని, నష్టపరిహారం చెల్లించాలని, కాగజ్ నగర్ పట్టణానికి చెందిన అన్వరుల్లా హక్ తన పేరిట పట్టగల భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని, జైనూర్ మండలం పానపటార్ గ్రామానికి చెందిన గిరిజన రైతులు ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద పక్కా ఇండ్లు మంజూరు చేయాలని, దహెగాం మండలం పీకలగుండం గ్రామస్తులు తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని, కౌటాల మండల కేంద్రానికి చెందిన డి. ముత్తయ్య మండల కేంద్రంలోని వారసంతలో స్వచ్ఛభారత్ క్రింద నిర్మించిన మూత్రశాలలకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని, వాంకిడి మండల కేంద్రానికి చెందిన దుర్గం శ్యాం రావు ఏజెన్సీ ప్రాంతాలలో బోడు భూములు సాగు చేస్తున్న అర్హులైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతుల వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ పలువురు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు

## హలో ఆదివాసి ఛలో ఉట్నూర్ పోస్టర్ల విడుదల

**కెరమెరి, నవంబర్ 10, ప్రభాతవార్త :**

ఈ నెల 23న ఉట్నూర్‌లోని ఎంపీడీవో గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఆదివాసి ధర్మ యుద్ధనికి ఆదివాసులు అందరు కదంతొక్కాలి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవా విజయ్ అన్నారు. సోమవారం కెరమెరి మండల కేంద్రంలో "హలో ఆదివాసి ఛలో ఉట్నూర్" పేరుతో ఆదివాసి ధర్మ యుద్ధం పోస్టర్లను ఆదివాసి నాయకులు విడుదల చేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో గ్రౌండ్ లో ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ భారీ బహిరంగ సభ ఆదివాసి సంఘాల సమన్వయ కమిటీ అధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల నాయకుల అధ్వర్యంలో ఈ భారీ బహిరంగసభ సభ జరగనుంది అన్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించడమే ప్రధాన ఎజెండాగా జరగనున్న ఈ సభకు అన్ని సంఘాల నాయకులు, గ్రామ గ్రామాల పటేల్ దేవారిలు, గ్రామ గ్రామాల పెద్దలూ, యువకులు మహిళలు అందరు కూడా భారీ ఎత్తున పాల్గొని ఈ భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆసిఫాబాద్, ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పంద్రం యశ్వంత్ రావు, కెరమెరి పేసా కొఆర్డినేటర్ ఆడ ఆనంద్ రావు, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకుడు కనక ప్రభాకర్, కొలం సంఘం మండల నాయకుడు కుంరం మారుతి, విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు సెడ్మకి తుకారాం, మరియు రాయ్ సెంటర్ తుడుందెబ్బ, ఆదివాసి సంక్షేమ పరిషత్, విద్యార్థి సంఘం యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ల విడుదల చేస్తున్న ఆదివాసి నాయకులు



## సులబ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి

**- ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చిన బిజెపి నాయకులు**

**తాండూర్, నవంబర్ 10, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో ప్రతి బుధ, శనివారం నిర్వహించే వారసంతల వద్ద సులబ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణి ఫిర్యాదు విభాగంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వారసంతల వద్ద సులబ్ కాంప్లెక్స్‌లు లేక వారసంతకు వచ్చే వ్యాపారులు, వినియోగదారులు చాలా అవస్థలు పడుతున్నారని అన్నారు. కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి శనివారం నిర్వహించే వారసంత వద్ద నిర్మిస్తున్న సులబ్ కాంప్లెక్స్ పనులు పునాది వద్దనే ఆగిపోయాయన్నారు. మండలంలోని పలు గ్రామాలలో పగలు కోతులు, రాత్రివేళ రోడ్లపై పశువుల సంచారం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటి నివారణకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తానని నాయకులకు ఎంపీడీవో శ్రీనివాస్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దూడపాక భరత్, జిల్లా కార్యదర్శి రామగొని మహీధర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్ నాయకులు శివ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## క్వార్టర్స్ కౌన్సిలింగ్ పారదర్శకంగా నిర్వహణ

**మందమర్రి, నవంబర్ 10, ప్రభాతవార్త**

సింగరేణి ఎస్సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్ సోమవారం రోజున మందమర్రి ఏరియా సిఈఆర్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాలకు కలిపి మొత్తం 107 క్వార్టర్స్ ప్రకటించగా, 87 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియార్టీ ఆధారంగా 18 మంది ఎస్సీడబ్ల్యూఏ ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్స్ కేటాయించామని సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వంశీ, మేనేజ్‌మెంట్ ట్రైని (సివిల్) రాజు పాల్గొన్నారు.

## జన్నారం ఎఫ్ఆర్ఓగా లక్ష్మీనారాయణ

**జన్నారం, నవంబర్ 10, ప్రభాతవార్త**



జన్నారం అటవీ రేంజ్ అధికారిగా లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు ఎఫ్ఆర్ఓ మమత నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. కేవలం ఒక నెల రోజులపాటు ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓగా మమత బాధ్యతలు నిర్వర్తించారు. లక్ష్మీనారాయణ గతంలో జన్నారం ఎఫ్ఆర్ఓగా పనిచేసి సెలవుపై వెళ్లాడు. కాగా సోమవారం రోజున స్థానిక అటవీ రేంజి కార్యాలయంలో పూర్తి రేంజ్ అధికారి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కలప రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణకు పలువురు అటవీ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

**- హెచ్ఎమ్ఎస్ డిమాండ్**

**జైపూర్, నవంబర్ 10, ప్రభాతవార్త**

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హెచ్ఎమ్ఎస్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా హెచ్.ఎం.ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రతి నెల మొదటి వారం కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినప్పటికీ కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని నాయకులు మండిపడ్డారు. కార్మికులకు వేతనాలు చెల్లించడంలో కాంట్రాక్టు, సబ్ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించి, సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ ప్రకారం ప్రతి నెల 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విక్రమ్ కుమార్, సాయికృష్ణ సంపత్, నవీన్, సత్యనారాయణ, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థినికి బ్రాంజ్ మెడల్

**బెల్లంపల్లి, నవంబర్ 10, ప్రభాతవార్త**



శుక్రవారం రోజున ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన జోనల్ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో బెల్లంపల్లి కృష్ణవేణి పాఠశాలకు చెందినా కే. దీక్ష 14 సం,, బాలికల విభాగంలో 100 మీటర్ల హార్డిల్స్ పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ సాధించిందని పాఠశాల డైరెక్టర్ ఈ రవి ప్రసాద్, ప్రిన్సిపల్ యం. రాజా రమేష్ లు ఒక ప్రకటనలో తెలియజేశారు. తదుపరి వారు మాట్లడుతూ విద్యతో పాటు క్రీడలలో పాల్గొనడం ద్వారా మనసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడల పట్ల మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని, శారీరక ఆరోగ్యానికి మేలు చేస్తాయని అన్నారు. అనతరం మెడల్ సాధించడానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు సల్పాల సంతోష్ యాదవ్, వడ్నాల మల్లేష్ యాదవ్ ను అభినందించారు.



## విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంచాలి

**లక్షెట్టిపేట, నవంబర్ 10, ప్రభాతవార్త**

విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు లక్షెట్టిపేట మండలంలోని వెంకట్రావుపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పర్వీన్ సుల్తానా సూచించారు. వెంకట్రావ్ పేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు చదువు పునాది లాంటిదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజలింగు పాల్గొన్నారు..

## చేడ్వాయిలో వాహనాల తనిఖీ

**పెంచికల్ పేట్, నవంబర్ 10, ప్రభాతవార్త :**

హెల్మెంట్ లేకుండా, అతివేగంతో వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై అనిల్ కుమార్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పెంచికల్ పేట్ ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెంట్, వాహన పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై అనిల్ కుమార్

### సింగరేణి మహిళా జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీలో

# మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన సదస్సు

**మందమర్రి, నవంబర్ 10, ప్రభాతవార్త**



మందమర్రిలోని సింగరేణి మహిళా జూనియర్, డిగ్రీ కాలేజీ లో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యులు మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్ అవగాహన వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఎవరైనా అనుచితంగా మాట్లాడినా, ప్రవర్తించినా తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. అలాగే అటువంటి పరిస్థితుల నుంచి బయటపడే మార్గాలను కూడా వివరిస్తూ విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు. షీ టీమ్ ప్రతినిధులు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రతిరోజు బస్టాండ్‌లు, ప్రధాన చౌరస్తాలు, కాలేజీల వద్ద టీమ్ పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే భయపడకుండా 6303923700 నంబర్‌కు కాల్ చేయాలని, కాల్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. అదే విధంగా, సైబర్ మోసాలు, లోన్ యాప్‌ల వలలో పడకూడదని హెచ్చరించారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు శ్రవణ్, జ్యోతి, దివ్య, కాలేజీ ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రత్యేక లోక్ అదాలత్ - వేగవంతమైన న్యాయం

### రాజీమార్గమే రాజమార్గం : మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి విజ్ఞప్తి



**మందమర్రి, నవంబర్ 10, ప్రభాతవార్త**

లోక్ అదాలత్ అనేది కేసుల పరిష్కారానికి ఒక అద్భుతమైన వేదిక. క్షణికావేశంలో నమోదైన చిన్న కేసులు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, చెక్ బౌన్స్, చిన్నపాటి సివిల్ తగాదాలు వంటి రాజీ సాధ్యమైన కేసులను న్యాయస్థానం పరిధిలో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చు. ప్రత్యేక లోక్ అదాలత్ – వేగవంతమైన న్యాయం పొందండి అని మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ – కాలాన్ని, ధనాన్ని వృథా చేసుకోవడం కంటే సామరస్యం నిండిన రాజీ మార్గమే అత్యుత్తమం, రాజీ మార్గమే రాజమార్గం అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 15వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో, మందమర్రి సర్కిల్ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్ అనేది కేసుల పరిష్కారానికి ఒక అద్భుతమైన వేదిక. క్షణికావేశంలో నమోదైన చిన్న కేసులు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, చెక్ బౌన్స్, చిన్నపాటి సివిల్ తగాదాలు వంటి రాజీ సాధ్యమైన కేసులను న్యాయస్థానం పరిధిలో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చు. ఈ ప్రక్రియ ద్వారా న్యాయం తక్కువ సమయంలో లభించడమే కాకుండా, ఇరు పక్షాల మధ్య సయోధ్య కుదిరి సంబంధాలు శాశ్వతంగా మెరుగుపడతాయి. కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ, ఖర్చు ఆదా అవుతుంది. మంద మర్రి సర్కిల్ పరిధిలో గల మందమర్రి, రామకృష్ణాపూర్, కాశీపేట, దేవపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజలు ఈ లోక్ అదాలత్‌లో పాల్గొని తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకొని వేగవంతమైన న్యాయం పొందాలని ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వాసవి క్లబ్ సేవలు మరింత విస్తరించాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 10, ప్రభాతవార్త:**

వాసవి క్లబ్ సేవలను క్షేత్రస్థాయిలో మరింత విస్తరించాలని ఆ క్లబ్ గవర్నర్ ఇల్లందుల కిషోర్ పేర్కొన్నారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి మంథనిలో నిర్వహించిన జిల్లా వి107ఏ వార్షిక సదస్సులో పాల్గొని మాట్లాడారు. 2025 సంవత్సరానికి గాను ఆసిఫాబాద్ వాసవి క్లబ్ చేసిన సేవలు అభినందనీయని కొనియాడారు. దీనికి గాను పలు అవార్డులు సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉత్తమ క్లబ్ అధ్యక్షునిగా పాత శ్రీనివాస్, ఉత్తమ కార్యదర్శి ముక్కకృష్ణమూర్తి, ఉత్తమ కోశాధికారిగా కట్కూరి కిషోర్ లు ఎంపికయ్యారని, అదేవిధంగా వివిధ రంగాలలో కూడా ఆసిఫాబాద్ వాసవి క్లబ్ అవార్డ్స్ సొంతం చేసుకున్నట్లు వెల్లడించారు. వీరు క్లబ్ గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు ఏకిరాల శ్రీనివాస్, ఆసిఫాబాద్ క్లబ్ సభ్యులు చెట్ల ప్రశాంత్, గోగుల శ్రీనివాస్, మార విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.




అవార్డులు అందుకుంటున్న ఆసిఫాబాద్ వాసవి క్లబ్ సభ్యులు

# నత్త నడకలో వాకింగ్ ట్రాక్ పనులు

**మందమర్రి, నవంబర్ 10, ప్రభాతవార్త**

*మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో సింగరేణి యాజమాన్యం వాకర్స్ కోసం ప్రారంభించిన వాకింగ్ ట్రాక్ పనులు నత్త నడకలో సాగుతున్నాయి. పనులు మొదలై దాదాపు తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటికీ పూర్తి కాలేదని మందమర్రి వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పనులు మొదలుపెట్టి మరిచిపోయారా? లేక మమ్మల్ని మురిపించడానికి మొదలు పెట్టారా?" అంటూ వాకర్స్ ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నడక కోసం వచ్చే వాకర్స్‌కు తాత్కాలిక అసౌకర్యం కలుగుతోందని వారు చెబుతున్నారు. వాకింగ్ ట్రాక్ పూర్తవితే ప్రతి వయసు వారికీ ఆరోగ్య పరిరక్షణలో ఎంతో మేలు కలుగుతుందని వాకర్స్ అభిప్రాయపడ్డారు. "ఇకనైనా సింగరేణి యాజమాన్యం శ్రద్ధ చూపించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి" అని వారు కోరుతున్నారు.*

